# "కవిత్వం"

ఆ మధ్య ఓ కుర్ర కవి నా దగ్గరికి ఓ కాయితాల కట్ట పట్టుకొచ్చి "సార్ కొన్ని హైకూలు రాసాను చూడండి" అన్నాడు.

అసలు 'హైకు' అంటే ఏమిటయ్యా అనడిగాను.

"ఏముంది సార్ చెప్పే విషయాన్ని మూడు వాక్యాలుగా విడగొట్టి రాయడమేగా" అన్నాడు... అమాయకంగా.

సరే అతని హైకుల గురించి వివరించి చెప్పి... రాసినవి మళ్లీ చూస్తా అన్జెప్పి పంపించివేసా.

ఈమధ్యన కవిత్వం జోరు ఊపందుకుంది. చాలా సంకలనాలు వచ్చేస్తున్నాయి. అమ్మకాలు మాత్రం సున్న. కేరళలో ఓ మలయాళీ కవి కవిత్వం అచ్చువేస్తే కనీసం అయిదువేల కాపీలు వేస్తారని విన్నాను. అసలు ఆ రాష్ట్రంలో కవి అంటే అపారమైన గౌరవం ప్రజలకు. సంవత్సరం సంవత్సరం జరిగే కవి సమ్మేళనాలప్పుడు తల్లిదండ్రులు తమ చిన్నపిల్లల్ని తీసుకెళ్లి కవులతో అక్షరాభ్యాసం చేయిస్తారు.

మన తెలుగునేల మీద కవికున్న గౌరవం గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. అసలు కవిత్వం పేరుతో వస్తున్న రచనల్ని చూడాలి. శ్రీశ్రీ అన్నట్టు 'ఇచ్చట ఖాళీ పేకేజీ పెట్టెలు అమ్మబడును' అన్న వాక్యాన్ని ముక్కల కింద విడగొట్టి నిలువునా పేర్చేవాళ్లే ఎక్కువ శాతం ఉన్నారు. కవిత్వానికి నిఘంటువ్వర్థం చూస్తే Sound and Meaning combined to convey a feeling or an idea అని వుంటుంది. శబ్దార్థాలు కలిసి ఓ అనుభూతిని వెల్లడించడం. కొన్ని శతాబ్దాల క్రితం మహాకవి కాళిదాసు రఘు వంశం మొదలుపెడుతూ 'వాగర్థా వివసంపృక్తౌ' అన్నాడు. 'వర్ణాత్మక శబ్దం యితివాక్' అని చెప్పబడుతుంది. వర్ణాత్మక శబ్దానికి మంచి అర్థాన్ని జోడించి అని. సరే ఎక్కడో తప్ప మంచి కవిత్వం కనబడ్డంలేదు. ఈరోజున 'శ్రీకృష్ణ అలసిన హళ్లి రాసిన ఓ మంచి కవిత చదువుకుందాం. 'వేకువ' శీర్షిక స్థలాభావం చేత కొన్ని చరణాలు మాత్రం ఇస్తున్నాను.

"రాత్రి నగ్న పరిష్వంగాన్ని విడిపించుకుని పుసి కన్ను తుడుచుకుంటూ ఆవులించి లేచాడు సూర్యుడు.

బలిసిన మేకనీ, గొర్రెనీ, కోడినీ చీల్చికోసి
గోధుమ నీలం తెలుపు ఎరుపు కండరాల్ని వేలాడదీసి
రంగురంగుల తూర్పు కసాయి కొట్టు తెరవగా
మా వూళ్లో తెల్లవారింది...
భగభగ మండే పద్దెనిమిదో నాలుక దాచి
వేటకుత్తి నిలచిన రెడ్డి వారబ్బాయి
మబ్బుకవతల నింగి ఎత్తుకి
కోరికల గుండె తిత్తినొత్తి
అగ్గిపూల పడవెక్కి వెళ్లగా
మా ఊళ్లో తెల్లవారింది...
చిలుం పట్టిన పాత కవి
సమయాల్ని
తళతళ మెరిసేందుకు రుద్ది
కడగడానికి
ఏటివైపు నడవగా
ప్రసవించిన లేత పిల్లల్ని వదలి పరిగెత్త లేక
పొదలో గజగజలాడే వెండి కుందేల్ని
నా యింటి కుక్క పట్టిలాగిన వెంటనే
జివ్వున నెత్తురు కారినప్పుడు
మా ఊళ్లో తెల్లవారింది..."
అట్లా కొనసాగుతుంది.

ఓ పల్లెటూరి సూర్యోదయ చిత్రాన్ని మనసుకు హత్తుకొనేలా చెప్పారాయన. కవిత్వం శాఖోపశాఖలుగా చీలిపోయింది. సరే కవిత్వమే అనుకుంటే కులాల వారీగా ప్రాంతాల వారీగా బదాబదలైనారు కవులు. సరే అనుకుందాం. అసలుసిసలు తెలుగు కవిత అనెప్పుడు వస్తుందో అని ఆశగా ఎదురుచూద్దం మినహా చేయగలిగిందేమీ లేదు.

* * *

*మా తెలుగు తల్లికీ మల్లెపూదండ*
*మా కన్న తల్లికీ మంగళారతులూ...* ●